తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 192
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
మంగళవారం 20-02-2024





# మేడారానికి అంతా సిద్ధం

**జయభేరి, వరంగల్, ఫిబ్రవరి 19**

రెండేళ్లకు ఒక్కసారి జరిగే అతి పెద్ద గిరిజన మేడారం జాతరకు భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. భక్తులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి టీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ము నలుమూలల నుంచి మేడారం చేరుకునేందుకు ప్రత్యేక రవాణా సదు పాయాలను కల్పించింది. ఖమ్మం, వరంగల్ బస్టాండ్లలో ప్రత్యేక క్యూలు సిద్ధం చేశారు అధికారులుఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సమయం ఆసన్నమైంది. మేడారం మహాజాతర ఎల్లుండి నుంచి ప్రారంభం కానుంది. దానిలో భాగంగా.. నాలుగు రోజులు ముందుగానే మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది టీఎస్ఆర్టీసీ. మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ అధికారులు.. ఖమ్మం రీజియన్ నుండి 494 సర్వీసుల ఏర్పాటు చేశారు. మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఖమ్మం రీజియన్లోని ఏడు డిపోల పరిధిలో 11 టీఎస్ఆర్టీసీ పాయింట్ల దగ్గర మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులు వారం రోజులుగా దృష్టి సారించారు. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, చర్ల, టేకులపల్లి, పాల్వంచ, మంగపేట, వెంకటాపురం, ఏటూరునాగారం నుంచి మేడారం జాతరకు స్పెషల్ బస్సులు నడుపుతున్నారు.

# కాంగ్రెస్ లోకి ఈటెల

## బీజేపీ మాజీ ఎమ్మెల్యే పార్టీ మారుతున్నారా..?

కొన్ని రోజులుగా పార్టీలో సర్దుకు పోతున్న ఆయన అధికార కాంగ్రెస్వైపు చూస్తున్నారా.. గత కొద్ది రోజులుగా మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజమేనా.. హస్తం గూటికి చేరేందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నారా అంటే అవునే సమాధానం వస్తోంది కాంగ్రెస్ వర్గాల నుంచి. కరీంనగర్లో బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్కు మధ్య పొసగడం లేదని చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని బండి ఇటీవల ఖండించారు. కానీ అనుచరులు మాత్రం వర్గాలుగా విడిపోయారు. ఇక మరోవైపు బీజేపీ తరపున 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్ హుజూరాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. లోక్సభ ఎన్నికల్లో మల్కాజ్గిరి సీటు ఆశిస్తున్నారు. అయితే మల్కాజ్గిరి టికెట్ ఇవ్వడానికి బీజేపీ అధిష్టానం అంగీకరించడం లేదని సమాచారం.మల్కాజ్గిరి టికెట్ను బీజేపీ నిరాకరించడంతో తనకు బలమైన క్యాడర్ ఉన్న కరీంనగర్ ఎంపీ టికెట్ ఇవ్వాలని ఈటల కోరుతున్నారు. ఇక్కడ కూడా బండి సంజయ్ను కాదని ఇతరులకు టికెట్ ఇచ్చే అవకాశం లేదని కమలనాథులు క్లారిటీ ఇచ్చారు. దీంతో ఈటల బీజేపీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీ మారతారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఆయన కాంగ్రెస్లో చేరడం ఖాయమైందని, పార్టీ మారేందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నారని వార్తలు మరోమారు చెక్కర్లు కొడుతున్నాయి. ఈమేరు ఇటీవల బీఆర్ఎస్ను వీడి కాంగ్రెస్లో చేరిన మైనంపల్లి హన్మంతరావు, పట్నం మహేందర్రెడ్డి ఈటలతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది.


..మిగతాది 2 లో

# 20 లక్షల దరఖాస్తులు

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 19:**

'తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. తాము అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు జారీ చేస్తాం' ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు ఇవీ. అధికారంలోకి వచ్చి 70 రోజులు గడిచినా.. ప్రభుత్వం మాత్రం రేషన్ కార్డుల జారీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రోజుకో అప్డేట్ వినిపిస్తున్నా.. అన్ని పథకాలకు అవసరమయ్యే రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం మాత్రం అధికారిక ప్రకటన జారీ చేయడం లేదు. దీంతో ఇప్పటికే అభయహస్తం దరఖాస్తు చేసుకున్నవారు ఆందోళన చెందుతున్నారు.కొత్త రేషన్ కార్డులు ఎప్పటి నుంచి వస్తాయి.. ఎలా అప్లై చేసుకోవాలి అనే అంశంపై చాలా మందిలో గందరగోళం నెలకొంది. అయితే ప్రభుత్వం నుంచి మాత్రం కనీసం దరఖాస్తుల స్వీకరణ ప్రకటన కూడా రావడం లేదు.

..మిగతాది 2 లో







# మాకు న్యాయం చేయండి

- రేవంత్ కు డీఎస్సీ అభ్యర్థుల వినతి

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 19**

2008లో నాటి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6వ తేదీన 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని చెప్పింది. సుమారు 50 రోజుల తర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009 జనవరి 29వ

..మిగతాది 2 లో



# ఆడపిల్లకు ఆసరా..

## సుకన్య సమృద్ధి యోజన స్కీం

**జయభేరి, న్యూ డిల్లీ ఫిబ్రవరి 19 :**

సుకన్య సమృద్ధి స్కీం.. ఆడపిల్లలున్న తల్లిదండ్రులకు ఎంతోకొంత ఈ కేంద్ర ప్రభుత్వ పథకం గురించి అవగాహన ఉండే ఉంటుంది. పన్ను రాయితీ, వడ్డీ, దీర్ఘకాల మదుపు సదుపాయం, స్వల్ప మొత్తాల్లో కూడా పెట్టుబడి వంటివి ఈ పథకంలో ఉన్న ప్రయోజనాలు. తాజాగా ఈ స్కీంకు 8.2 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంతకీ ఈ పథకంలోని లాభాలు ఏమిటి? ఏ మేరకు ఇన్వెస్ట్ చేయవచ్చు?సురక్షితమైన పెట్టుబడులు, ఆడపిల్లల భవిష్యత్తుకు పెద్దపీట వేసేవారికి సుకన్య సమృద్ధి స్కీం (ఎస్ఎస్వై) సరైనది. నెలకు రూ.12,500 పెట్టుబడి (ఏటా రూ.1.5 లక్షలు) తో 8 శాతానికి పైగా వడ్డీ అందితే ఆఖర్లో రూ.70 లక్షల వరకు అందుకునే సౌకర్యం ఈ పథకంలో ఉన్నది.

**ఎవరు అర్హులు?**

- భారతీయులై ఉండాలి.
- ఆడపిల్లల తల్లిదండ్రులు లేదా గార్డియన్లకు మాత్రమే అర్హత ఉంటుంది.
- అమ్మాయి వయసు పదేండ్లు నిండేలోగానే స్కీం తీసుకోవాల్సి ఉంటుంది.
- ఒక్కరికి ఒక్క ఖాతానే తెరుస్తారు.
- కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే స్కీం వర్తిస్తుంది.

**అవసరానికి నగదు తీసుకోవచ్చా?**

రెగ్యులర్ ఫిక్స్డ్ డిపాజిట్ (ఎఫ్డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ), ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) తరహాలో కాకుండా ఇందులో నగదు ఉపసంహరణ కాస్త భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఈ పథకం ప్రధాన ఉద్దేశమే ఆడపిల్ల పెండ్లి, చదువుకు పైసలు అందిరావడం. అందుకే పథకం ప్రారంభించిన 21 సంవత్సరాలకే మెచ్యూరిటీ ఉంటుంది. కానీ ఖాతా ప్రారంభించిన 15 ఏండ్లదాకా

..మిగతాది 2 లో

# బీజేపీ.. బీఆర్ఎస్ పొత్తు పొడుస్తుందా

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 19:**

రాజకీయాలంటేనే అవసరాలు.. అవసరాల ఆధారంగానే రాజకీయాలు నడుస్తాయి. రాజకీయ పార్టీలు సేవ చేసే మఠాలు కాదు కాబట్టి.. వారి ప్రయోజనాలకు అనుగుణంగానే అడుగులు వేస్తాయి. ఇందులో ఏ రాజకీయ పార్టీ కూడా సుద్ధ పూస కాదు. అధికారం కోసం పొత్తు పెట్టుకుంటాయి. అదే అధికారం కోసం పొత్తును తెంచుకుంటాయి. విలువలు, వంకాయలు అని వెతకాల్సిన పనిలేదు.. అయితే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన రాజకీయ పొత్తు చర్చల్లో ఉంది. అది ముడి పడుతుందా? విడిపోతుందా? అనేది పక్కన పెడితే ప్రస్తుతానికైతే ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది. త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కలిసి పోటీ చేస్తాయా? రెండు పార్టీల

..మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ లోకి ఈటెల

ఇటీవల ముగ్గురూ సమావేశమయ్యారని తెలుస్తోందికరీంనగర్ ఎంపీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్కు బలమైన నాయకుడు లేడు. దీంతో ఈటలను కాంగ్రెస్లో చేర్చుకుని ఎంపీగా పోటీ చేయించాలని హస్తం నేతలు భావిస్తున్నారు. గతంలో పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా గెలిచారు. తర్వాత బోయినపల్లి వినోద్ బీఆర్ఎస్ నుంచి బండి సంజయ్ బీజేపీ నుంచి గెలిచారు. తాజాగా పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్కు మారారు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హనుమంత రావు, మాజీ మంత్రి పట్నం మహేందర్రెడ్డితో బీజేపీ నేత, హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. ఒక చోట కలిసి ముగ్గురు నేతలు చర్చించుకున్నారు. కాంగ్రెస్ నేతలతో ఈటల రాజేందర్ భేటీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కొద్ది రోజులుగా ఈటల రాజేందర్ బీజేపీ హైకమాండ్ మీద అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేసేందుకు ఆయన టిక్కెట్ అడుగుతున్నారు. కానీ హైకమాండ్ ఏదీ తేల్చడం లేదు. ఈటల రాజేందర్ మాత్రం ఇవేవి పట్టించుకోకుండా మల్కాజ్గిరిలో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అధిష్టానానికి సంకేతాన్ని పంపుతున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈటల ఫర్ మల్కాజ్గిరి' క్రికెట్ ట్రోఫీని ఆయన అనుచరులు స్టార్ట్ చేశారు. అయితే దీనికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కూడా స్వయంగా తన నివాసంలో ఈటల రాజేందర్ రిలీజ్ చేశారు. ఈటలకే మల్కాజ్గిరి టికెట్ రాబోతున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. దీంతో మరోసారి ఈటల దుమారం తెరపైకి వచ్చింది. ఎంపీగా పోటీపై బీజేపీ అధిష్టానం నిర్ణయం కంటే ముందే అనుచరుల పేరుతో తానే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.అంశంపై పార్టీ నేతలు హైకమండ్ కు పిర్యాదులు చేశారు. ఇప్పటికి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గతంలో ఆయనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినా పార్టీ పరిస్థితి మెరుగుపడలేదు. ఈటల సూచనల మేరకే బీసీ సీఎం నినాదాన్ని అందుకున్నారని కూడా అంటున్నారు. అయితే బీసీసీ సీఎం నినాదం ఇచ్చినా ఎల్పీ నేతగా మళ్లీ రెడ్డి వర్గానికే పదవి ఇచ్చారు. దీనిపైనా ఈటల అసంతృప్తి గా ఉన్నారంటున్నారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యి చాలా సేపు చర్చలు జరపడంతో త్వరలో ఆయన కమలం పార్టీ గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరుతున్నట్లు చర్చ జోరందుకుంది. త్వరలో కాంగ్రెస్ పార్టీలో ఈటల రాజేందర్ చేరుతారనే చర్చకు.. అలాగే కాంగ్రెస్ నేతలతో భేటీ కావడంపై ఈటల వర్గం క్లారిటీ ఇచ్చింది. పార్టీ మారుతారని వస్తున్న వార్తలను ఖండించింది. కార్పొరేటర్ కొప్పుల నరసింహా రెడ్డి గృహ ప్రవేశంలో అందరూ కలిశారని.. అంతే కానీ రాజకీయాలపై చర్చలు చేసేందుకు కాదని వివరణ ఇచ్చింది. దీనిపై ఈటల రాజేందర్ మాత్రం ఇప్పటికి స్పందించక పోవడంతో తెర వెనుక ఏదో జరుగుతోందన్న అభిప్రాయానికి వస్తున్నారు.ఇక కరీంనగర్ జిల్లాలో ఈటల రాజేందర్కు మంచి క్యాడర్ ఉన్నందున ఆయన అయితేనే బండి సంజయ్ను ఎదుర్కొంటారని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కమలంలో సర్దుబాటు కాలేక ఇబ్బంది పడుతున్న ఈటల రాజేందర్ మరి కాంగ్రెస్లోకి వెళ్తారా లేదా అనేది చూడాలి...

## 20 లక్షల దరఖాస్తులు

ఎమ్మెల్యేలు అదిగో.. ఇదిగో అని ప్రకటిస్తున్నారు. కానీ, అధికారిక ఉత్తర్వులు మాత్రం రావడం లేదు. కనీసం దరఖాస్తులు అయినా స్వీకరించాలని అర్హులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ ప్రస్తుతం సుదీర్ఘ ప్రక్రియ. దరఖాస్తులు స్వీకరించడం ఒక ఎత్తు అయితే.. అర్హులను ఎంపిక చేయడం కత్తిమీద సామే. నిబంధనల రూపకల్పన,అర్హుల గుర్తింపు, పైరవీలు, ఇంటింటి సర్వే.. అనర్హుల తొలగింపు వంటి అంశాలు చాలా కీలకం. ప్రస్తుతం రాష్ట్రంలో 90.14 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. వాటి స్క్రుటినీ కష్టతరంగా మారనుంది.ఇదిలా ఉంటే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. ప్రస్తుతం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్తోపాటు, ఆరోగ్యశ్రీ, యువతులకు స్కూటీలు, ఇందిరమ్మ ఇళ్లకు రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. ఇటీవల అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ సమయంలోనూ రేషన్కార్డు జిరాక్స్ జత చేయాలని కోరింది. ఈ నేపథ్యంలో రేషన్కార్డు లేరివారు తాము పథకాలకు అర్హత కోల్పోతామని ఆందోళన చెందుతున్నారుమరోవైపు ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో 20 లక్షల మంది తమకు రేషన్ కార్డు కావాలని దరఖాస్తుపై పేర్కొన్నారు. ప్రత్యేక ఫాం ఏమీ లేదని ప్రభుత్వం తెలుపడంతో ప్రజాపాలన దరఖాస్తుపైనే చాలా మంది రేషన్ కార్డు కావాలని అర్జీ పెట్టారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మాత్రం స్పష్టత లేదు.

## మాకు న్యాయం చేయండి

తేదీన జీవో నంబర్ 28ను తీసుకొచ్చింది. బీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ కూడా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సూచించింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం 2010 జూన్ 21న.. జీవో 27ను విడుదల చేసింది. దీని ప్రకారం అధికారులు నియామక కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించారు.జిల్లాల వారీగా కామన్ మెరిట్ ప్రకారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు. 2009 జూన్ 27వ తేదీన కౌన్సిలింగ్ ప్రక్రియ కూడా మొదలైంది. డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్ను ఆశ్రయించగా.. జూన్ 28న కౌన్సిలింగ్పై స్టే విధించింది. జీవో 28 ప్రకారం 30 శాతం కోటా కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది.

దీంతో అధికారులు కౌన్సిలింగ్ నిలిపివేశారు. ఆ తర్వాత 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కొత్త మెరిట్ లిస్టు విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మంచి మార్కులు సాధించినా ఉద్యోగం రాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 3500 మంది బీఈడీ అభ్యర్థుల కలలు కుప్పకూలిపోయాయి. ఇందులో తెలంగాణ అభ్యర్థులు 1200 మంది వరకు ఉన్నారు. అప్పటి నుంచి వారు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వం చుట్టూ.. కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ధర్నాలు, రాస్తా రోకోలు, నిరాహార దీక్షలు.. ఇలా అన్ని ప్రయత్నాలు చేశారు. 2013 జూలై 15న సుప్రీంకోర్టు బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే న్యాయం చేస్తామని చెప్పి ఇందిరా పార్కులో హామీ ఇచ్చిన టీఆర్ఎస్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చింది2016 జనవరి 3వ తేదీన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా బీఈడీ అభ్యర్థుల ప్రతినిధులను సచివాలయానికి పిలిపించుకున్నారు. వారికి జరిగిన అన్యాయాన్ని వారం రోజుల్లోగా సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పని పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండాలంటూ మంజీరా గెస్ట్ హౌస్లో సదుపాయం కల్పించాలని చెప్పారు. ప్రతినిధుల బృందం దాదాపు వారం రోజుల పాటు మంజీరా గెస్ట్ హౌస్లో ఉండి ఎదురు చూశారు. కానీ హామీ అమలు చేయలేదు. ఆ తర్వాత వరంగల్లో నిర్వహించిన బహిరంగ సభలో కూడా నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. 2017 ఫిబ్రవరి 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని బెంచ్, 27 సెప్టెంబర్ 2022న హైకోర్టు ధర్మాసనం బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పునిచ్చాయి. పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించింది.

అయినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా ఈనెల 8వ తేదీన రాష్ట్ర హైకోర్టు డీఎస్సీ 2008 బాధితుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని గురువారం తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం ఖాళీల్లో వారిని భర్తీ చేయండి లేదా.. నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు ఏపీలో మాదిరిగా కనీసం కాంట్రాక్ట్ పద్దతిలో అయినా ఉద్యోగాలు ఇవ్వండని ఆదేశించింది. ఏపీలో దాదాపు రెండున్నర సంవత్సరాల కింద డీఎస్సీ 2008 బాధితులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చారు. తాజా తీర్పు ప్రకారం మరో 50 మందికి పోస్టింగ్స్ ఇచ్చారు. దాదాపు 15 సంవత్సరాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నామని.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

# శివ శివ.. హర హర...

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జిహెచ్ఎంసి మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ అవినీతి భాగోతం పూర్తిగా తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఇదే విషయంపై అందిస్తున్న 'జయభేరి' అక్షర యజ్ఞం కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ...



**జయభేరి, హైదరాబాద్ :**
ఒకటి కాదు రెండు కాదు వందల కోట్లు అతని అవినీతి దాహానికి అంతులేదు. తెలంగాణ రాష్ట్ర సంపద తెలంగాణ ప్రజలకు పంచాలని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్న తర్వాత ఒక కుటుంబానికి అధికారం దక్కిందని జనం అన్ని వర్గాల్లో ఉద్యమం మొదలైంది. నాడు తెలంగాణ రాష్ట్రం కొరకు అన్ని వర్గాలు పనిచేసే ఉద్యోగులు, విద్యార్థులు సకలజనులు ఉద్యమిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్ర వేరుపడ్డ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగించిన పదేండ్ల తరువాత మళ్లీ అదే పెద్ద ఎత్తున మార్పు కోసం కాంగ్రెస్కు అధికారాన్ని కట్టబెట్టింది తెలంగాణ ప్రజలే... ఈ పది సంవత్సర కాలంలో వ్యవస్థలు పూర్తిగా విధ్వంసమైన సంగతి మనందరికీ తెలిసిందే. ఇదిలా ఉంటే జిహెచ్ఎంసి డైరెక్టర్గా పని చేసిన శివ బాలకృష్ణ అవినీతి బాగోతం కట్టలు కట్టలుగా పుంకాలు పుంకాలుగా అతని అవినీతి చిట్టాను తోడుతుంటే ఎన్నెన్నో నమ్మలేని నిజాలు కండ్లు బైర్లు కమ్మే ఆస్తులను లెక్కపెట్టడానికి పాపం ఏసీబీ అనేక తంటాలు పడుతోంది. మొత్తానికి ఈ శివ బాలకృష్ణ కథ ఇంకా ముగియలేదన్నది వాస్తవం.

శివ బాలకృష్ణ తెలంగాణ ప్రభుత్వంలో కీలకంగా పని చేసినట్టుగా సమాచారం. అతనిపై ఆఫీసరు ఆ... తో మొదలై విందా...తో ముగుస్తుంది.. అతని శివ బాలకృష్ణ ముందు నడిపి మిగతా తతంగా అంతా డైరెక్ట్గా తారకరామారావుతో కథ నడిపినట్టుగా వ్యవహారం బయట గుప్పుమంటుంది. నిజానికి శివ బాలకృష్ణ దొరికిపోయాడు కానీ అతనిపై ఆఫీసరు ఆయన గారి బాగోతం మరెప్పుడు బయట పెడతారా అని ఉద్యోగుల్లో సగం మంది అదే గుసగుసలు పెట్టుకుంటున్నారు..

శివ బాలకృష్ణ దొరికిపోయిన తర్వాత కూడా ఆయన ముఖంలో గింత కూడా పశ్చాత్తాప ధోరణి కనిపించడం లేదు అంటే అతనికి బయటకు వచ్చినంక ఇంకా వేలకోట్ల ఆస్తులు బినామీల పేరు మీద ఉన్నాయనే భరోసా కాబోలు... మొత్తానికి శివ బాలకృష్ణ వందల వేలకోట్ల అవినీతి బాగోదానికి తెలంగాణ వేదిక అయింది. ఆ సొమ్ము తెలంగాణ ప్రజలది కాదా.. కాంట్రాక్టర్ ల నుంచి ఇల్లు పర్మిషన్ కోసం సెటప్ బాక్స్ పర్మిషన్ కోసం పూర్తిగా లంచాలకు మరిగిన శివ బాలకృష్ణ కాంట్రాక్టర్ల నుంచి ఎంతగా వేధించి వేధించి డబ్బులు వసూలు చేశాడో మరి.. ఇక ఇదే విషయం తెలంగాణ సమాజంలో బాగా నానుతూ దీనికి లింకు ఎక్కడా అని వెతికితే ఇంకెవరు... తెలంగాణ బాధ్యతని ఒకే కుటుంబం మోస్తున్న ఆ ఇంటి పెద్దలే అనే అనుమానాలకు తావు నెలకొంది.. శివ బాలకృష్ణ ఒక్కడే అంత సొమ్ము అంతగా వెనకేసుకున్నాడు అంటే మిగతా అతని పై ఆఫీసరు ఆ పై ఆఫీసర్ పైన ఇంకో ప్రజానాయకుడు ఎన్ని కోట్ల ఆస్తులు వెనకేసుకున్నారో ఆ దేవుడికే తెలియాలి.

వాస్తవానికి కల్వకుంట్ల ఫ్యామిలీ మీద అతని అనుసరగణం మీద ఏసీబీ దాడి చేయాలని తెలంగాణ ప్రజలు ఒక వర్గం కోరుకుంటున్నప్పటికీ ప్రభుత్వ అధికారి గనుక ఉద్యోగి ఆస్తిపాస్తులను అవినీతి భాగోతాన్ని ఏసిబి బట్టబయలు చేసింది కోర్టుల ద్వారా అతనికి శిక్షపడే విధంగా ఇంకా మరికొంత కాలం సోదాలు నిర్వహించే అవకాశం కనిపిస్తున్నందున ఆయన సంపాదించిన అవినీతి నగదును లెక్క వేయడంలో తల మునకలై పోతుంది ఏసీబీ..

తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లోనూ ప్రకృతి వనరులలోను ప్రాజెక్టుల విషయంలోనూ పూర్తిగా అవినీతి జరిగిందని శాసనసభలు తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రులు, గంగోలై పొడుస్తున్న ప్రజలు వింటున్నారు చూస్తున్నారు కానీ వాటిపై చర్య జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై గలాన్ని విప్పే అవకాశం నెమ్మది నెమ్మదిగా రాసుకుంటుంది. ఒక పక్క ఏసీబీతో శివ బాలకృష్ణను పూర్తిగా జప్తు చేస్తున్న ఇంకోవైపు ఆయనకు మించిన తిమింగలాలు రాజకీయాల్లో ఉన్నాయని వాటిని ఒక్కొక్కటిగా ఏరి పారేయాలని సీఎం రేవంత్ రెడ్డికి గట్టిగా వినిపించేలా ఆయన ముందరికి వాదన తీసుకొస్తున్నారు కొంతమంది నేతలు... వారిలో అదే కేసీఆర్ గుంపులో నుంచి ఇప్పుడు కాంగ్రెస్ లోకి వచ్చి గెలిచిన లీడర్లే కావడం విశేషం...

టిఆర్ఎస్ బాగోతం అవినీతి అంతా మాకు తెలుసు మేము అక్కడి నుంచి వచ్చిన వారమే అని చెబుతున్న ఆయా నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు ఆ రోజున కిమ్మనక కూర్చుని ఈ రోజున గొంతు విప్పడం విడ్డూరంగా కనిపిస్తోంది. ఒక శివ బాలకృష్ణ కాదు ఉద్యోగుల్లో బయటకు కనపడని అవినీతి జలగలు అవినీతి రాక్షసులు ఇంకా చాలానే ఉన్నాయనేది నిజమైన వాదన.. ఒక జిహెచ్ఎంసి శాఖలోనే ఇంత పెద్ద తిమింగలం ఉంటే రెవెన్యూ శాఖలో జలమండలి శాఖలో విద్యాశాఖలో ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖలలో ఇలాంటి చీడపురుగులు బాగా నాచు పట్టి కూర్చున్నాయి...

మరి వారి పీఠాలు కదిలేది ఎప్పుడో వారి ఇళ్ళను జప్తు చేసేది ఎప్పుడు అని ఆయా శాఖలోని చిరు ఉద్యోగులు చిన్న ఉద్యోగులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.. దొరికితే దొంగ దొరకకపోతే దొర అనే నానుడి ఎవరన్నారో ఏమోగానీ మొత్తానికి శివ బాలకృష్ణ దొరికి దొంగ అయిపోయాడు దొరకని వాళ్ళు ఇంకా దొరలాగా తిరుగుతున్నారు అని తెలంగాణ ప్రజలు ఒకరిద్దరు కూడిన చోట ఇదే విషయాన్ని ముచ్చటించుకుంటున్నారు..

ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఇలా ఎవరైనా చేస్తే శివ బాలకృష్ణ గతే పడుతుంది అనే ఒక స్టేట్మెంట్ ఎలా తీసుకోవాలి అని ఆటో టిఆర్ఎస్ మాజీ నాయకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తప్పు చేసిన వారికే కదా భయం అన్నట్టుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎత్తి పొడుస్తున్నారు. మొత్తానికి టైం బాగాలేదు అందుకే తలవంచుకొని కూర్చోవాలి అన్న వాదనతో టిఆర్ఎస్ నాయకులు ఉంటే... మీ అవినీతిని బయటపెడతాం, మీ బాగోతం అంతా బట్ట బయలు చేస్తాం అని కాంగ్రెస్ నేతలు చెబుతుండడం శాసన సభ పర్వం పూర్తిగా గడిచిపోయింది.. ఇక ఇప్పటికైనా శోభాల కృష్ణ లాంటి అవినీతి ఉద్యోగులు ఎక్కడెక్కడ ఏ శాఖలో ఉన్నారో ఏసీబీకి తెలవకపోయినా అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలను అడిగితే పూర్తిగా సమాచారం పక్కాగా లభించవచ్చు అని అంటున్నారు తెలంగాణ జనం...

రాను రాను కేంద్రంలో సిఐడి ఏసీబీ ఐటీ దాడులు సర్వసాధారణమైపోయాయి. అలా రైడ్ చేస్తే నాలుగు రోజులు జైల్లో కూర్చుని మళ్లీ మన ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు కోల్పోయిన ఆస్తులను మళ్లీ తిరిగి సంపాదించుకోవచ్చు అనే ఒక వాదన ఉండడంతో ఏదైనా అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి పాటుపడుతూ తిరిగి ఉద్యోగంలో చేరుతూ మళ్లీ అవినీతిని చేస్తూ ఇదొక అలవాటుగా మారిపోయింది కనుకనే ఇలాంటి అవినీతి తిమింగలాలు రోజురోజుకు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి... చట్టంలో ఉన్న లొసుగులను వాడుకొని ఇలాంటి అవినీతిపరులు చట్టానికి దొరకకుండా ఆస్తులు గడించి పూర్తిగా అవినీతికి అలవాటు పడిపోయి కరెన్సీ వాసనకు బానిస అయిపోయిన ఇలాంటి ఉద్యోగులను సమాజం నుంచే వెలివేయాలని తెలంగాణ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు... ఆదిశగా వాగ్దానం చేసిన సీఎం రేవంత్ రెడ్డి గారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జనానికి రానున్న రోజుల్లో మరి ఎలాంటి అవినీతి తిమింగలాలను పట్టిస్తారు ప్రతిపక్షంలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు తిన్న అవినీతి కూడును కక్కిస్తారా లేదా అన్న రీతిగా తెలంగాణ ప్రజలు ఆలోచనలు సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి అన్న మాటలను బట్టి చూస్తే గడిచింది కాదు ఇప్పుడు అలా ఎవరైనా చేస్తే శివ బాలకృష్ణకు పట్టిన గతే పడుతుంది అని చెప్పడంలో గతాన్ని తోడుతారా వర్తమానాన్ని వెంటాడుతారా అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది.



...కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత

## ఆడపిల్లకు ఆసరా..

మీరు నగదును జమ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 6 ఏండ్లపాటు ఎలాంటి పెట్టుబడి లేకపోయినా వడ్డీ జమవుతూ ఉంటుంది. అమ్మాయికి 18 ఏండ్లు దాటిన తర్వాత, ఆమె పెండ్లికి అవసరమైనప్పుడు ఈ నిధులను ఉపసంహరించుకునే వీలున్నది. అంతేగాక జమైన కార్పస్ మొత్తంలో 50 శాతం వరకూ బిడ్డ చదువు కోసం కూడా విత్డ్రా చేయవచ్చు. అయితే ఇందుకు ఆమె వయస్సు 16 ఏండ్లు దాటాలి లేదా కనీసం 10వ తరగతి పాసైనా అవ్వాలి. ఇక సంరక్షకుడో, తల్లిదండ్రులో మరణించినా ఈ నిధులను విత్డ్రా చేసుకోవచ్చు. లేదా ఖాతాదారు ఏదైనా తీవ్ర వ్యాధి బారినపడినా, మరణించినా కూడా ఈ నిధులను చెల్లిస్తారు. అయితే ఖాతా తెరిచిన 5 ఏండ్ల తర్వాతే వర్తిస్తుంది.

**ఖాతా ఎలా తెరవాలి?**
పోస్టాఫీసు, ఎంపిక చేసిన బ్యాంకుల్లో మాత్రమే ఈ స్కీం ఖాతాల్ని ఓపెన్ చేయవచ్చు. ఏడాదికి కనిష్ఠంగా రూ.250, గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వాయిదాల్లో కూడా పెట్టుబడిగా పెట్టే వెసులుబాటు ఉన్నది.

**వడ్డీరేటు ఎంత?**
ప్రతీ 3 నెలలకోసారి ఈ పథకం వడ్డీరేటును సమీక్షించి ఓ నిర్ణయం తీసుకుంటారు. ప్రభుత్వ సెక్యూరిటీల వడ్డీరేట్లలోని హెచ్చుతగ్గుల ఆధారంగా స్వల్ప మార్పులుంటాయి. ఈ ఏడాది జనవరిమార్చికిగాను 8.2 శాతం వడ్డీరేటును నిర్ణయించారు. గతంలో ఓసారి ఏకంగా 9.2 శాతం వడ్డీనిచ్చారు. ఇప్పటిదాకా కనిష్ఠస్థాయి 7.6 శాతం.

**వడ్డీని ఎలా జమ చేస్తారు?**
ప్రతి నెలా 5వ తేదీ నుంచి నెలాఖర్లోగా మీ ఖాతాలో ఉన్న సొమ్ముకు మాత్రమే వడ్డీని లెక్కిస్తారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాకే (మార్చి 31 తర్వాత) ఈ వడ్డీని ఖాతాల్లో జమ చేస్తారు.

**పన్ను ప్రయోజనాలు?**
ఈ పథకంలో లాభం అంతా పన్ను మినహాయింపులదే. నగదు చెల్లించినా, ఉపసంహరించినా ఎలాంటి పన్నూ ఉండదు. సెక్షన్ 80సి కింద గరిష్టంగా రూ.1.5 లక్షల వరకూ ట్యాక్స్ డిడక్షన్ కోసం క్లెయిం చేసుకోవచ్చు.

**చివరగా..**
ఈ పథకానికి 21 ఏండ్ల సుదీర్ఘ లాకిన్ పీరియడ్ ఉంటుంది. లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్మెంట్ తర్వాత పెద్ద మొత్తంలో సొమ్ము చేతికి రావాలనుకునేవాళ్లకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. మనం ఇన్వెస్ట్ చేసే వివిధ అసెట్ క్లాసుల్లో కొద్ది మొత్తాలను సేఫ్, సెక్యూర్డ్, మినిమం గ్యారెంటీ రిటర్నుల కోసం కూడా చూడాలి. ఆ కోవలోకే వస్తుంది ఈ సుకన్య సమృద్ధి స్కీం.

## బీజేపీ.. బీఆర్ఎస్ పొత్తు పొడుస్తుందా




ఉమ్మడి శత్రువు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే కలయిక తప్పదా? రాజకీయంగా వైరుధ్యాలు ఉన్నప్పటికీ..ఈ ఎన్నికల్లో వాటిని పక్కన పెట్టాలనే నిర్ణయానికి వచ్చారా? అంటే దీనికి అవును అనే సమాధానాలు ఢిల్లీ వర్గాల నుంచి వస్తున్నాయి. ఈ పార్లమెంటు ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కలిసి పోతాయని రెండు రోజులుగా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై అటు కారు, ఇటు కమలం పార్టీ నాయకులు స్పందించలేదు. కానీ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బరస్ట్ అయ్యారు. " భారత రాష్ట్ర సమితితో మెడకాయ మీద తలకాయ ఉన్న వాడెవడైనా పొత్తు పెట్టుకోడు" అని కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు కిషన్ రెడ్డి పై ఉన్న అసంతృప్తి వల్లే అని ప్రచారం కూడా జరిగింది. మరోవైపు భారత రాష్ట్ర సమితిని ఎట్టి పరిస్థితుల్లో ఎన్డీఏలో తెచ్చుకోబోమని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారని బండి సంజయ్ అంటున్నారు. అయితే బండి సంజయ్ మాటలు విన్న చాలా మంది తేలిగ్గా తీసుకుంటున్నారు. ఎందుకంటే రాజకీయాలలో ఎప్పటి మాటలు అప్పుడే ఉంటాయి. బండి సంజయ్ భారత రాష్ట్ర సమితి తో గురించి మాట్లాడినప్పుడు మాజీ మంత్రి మల్లారెడ్డి మరోరకంగా వ్యాఖ్యానించారు. బండి సంజయ్ వల్ల అయ్యేది, పోయేది ఏదీ లేదన్నారు. ఎటువంటి పొత్తులు లేకపోయినా మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానం నుంచి తన కుమారుడు పోటీ చేస్తాడని మల్లారెడ్డి ప్రకటించారు. అంటే మల్లారెడ్డి బిజెపితో పొత్తును ఏమాత్రం ఖండించలేదు. పైగా పై స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి అనే సంకేతాలు ఇచ్చారు. భారత రాష్ట్ర సమితి అధిష్టానం నుంచి ఎటువంటి సంకేతం లేకుండా మల్లారెడ్డి అలాంటి మాటలు మాట్లాడారనుకోవడానికి లేదు. మరోవైపు బిజెపితో పొత్తు పెట్టుకుంటే ఎలా ఉంటుంది అనే విషయాన్ని భారత రాష్ట్ర సమితి నాయకులను కేసీఆర్ అడిగి తెలుసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరో వైపు ఢిల్లీ స్థాయిలో పొత్తులకు సంబంధించి చర్చలు నడుస్తున్నట్టు సమాచారం. ప్రస్తుత సర్వే నివేదికల ఆధారంగా ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బిజెపి అధికారంలోకి వస్తుందని సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇవే చివరి ఎన్నికలు కావడంతో ఉన్న 400కు మించి పార్లమెంటు స్థానాలు గెలుచుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఇందిరా గాంధీ హయాంలో తప్ప ఇంతవరకు మనదేశంలో ఏ రాజకీయ పార్టీకి ఆ స్థాయిలో పార్లమెంటు స్థానాలు రాలేదు. ఈ ఘనతపై దృష్టి సారించిన నరేంద్ర మోడీ కాంగ్రెస్ మినహా దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలను ఎన్డీఏలో చేర్చుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కూడా ఇలాంటి వ్యాఖ్యలను చేశారు. అరవైపు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పరిస్థితి బాగోలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కీలక నాయకులు మొత్తం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కొన్ని కొన్ని పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా ముందుకు రావడం లేదు. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీని నిలువరించాలంటే బిజెపి సపోర్ట్ తీసుకోవాలని కేసిఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఇండియా కూటమి కూడా అంత బలంగా లేనందున బిజెపితో పొత్తు పెట్టుకోవడం తప్ప వేరే మార్గం లేదని కేసీఆర్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ పొత్తుకు సంబంధించి ఢిల్లీ స్థాయిలో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో.. కారు, కమలం మధ్య ముడిపడేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా వాటినే నిజం చేస్తున్నాయి.

# ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల

▸ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. సోమవారం రామాంతపూర్ డివిజన్ మెయిన్ రోడ్ మీద ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొని శివాజీ విగ్రహనికి పూలమాల వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని శివ జయంతి అని కూడా పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 19న జరుపుకుంటారు. భారతదేశం ఈ సంవత్సరం గొప్ప మరాఠా పాలకుడి 394వ జయంతి వేడుకలను జరుపుకుంటుంది. అతను మరాఠా సామ్రాజ్యానికి నాంది పలికిన బీజాపూర్ ఆదిల్షాహి సుల్తానేట్ నుండి ఒక ఎన్నోవ్వు చెక్కిన గొప్ప మరాఠా పాలకులలో ఒకడు అని ఎమ్మెల్యే శివాజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కైలాష్ పతి, టిడిపి మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు యాదగిరి, టిడిపి మాజీ కౌన్సిలర్ గోవర్ధన్ నాయక్, ఉప్పల్ మాజీ కౌన్సిలర్ పల్లె రాజ్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, నాయకురాలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.










# డిప్యూటీ డీఎం.. హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన

▸ డాక్టర్ వి.విజయలక్ష్మి

**జయభేరి, షాద్ నగర్ :**

షాద్ నగర్ డివిజన్ లో డిప్యూటీ డిఎం మరియు హెచ్ఓ గా డిప్యూటేషన్ లో పనిచేస్తున్న డాక్టర్ ఎస్ జయలక్ష్మి గత వారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రంలోని అన్ని డిపిటేషన్లను రద్దు చేయడం వల్ల డాక్టర్ ఎస్ జయలక్ష్మి తమ ఒరిజినల్ ప్లేస్ అయిన భద్రాదికొత్తగూడెంకు వెళ్లిపోయారు. ప్రస్తుతము షాద్నగర్ డివిజన్ డిప్యూటీ పోస్ట్ కాళీ అయినందువలన. రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. వెంకటేశ్వరరావు షాద్ నగర్ పిపి యూనిట్ లో పనిచేస్తున్న డాక్టర్ వి.విజయలక్ష్మి కీ షాద్ నగర్ డివిజన్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ గా అదనపు బాధ్యతలు ఇవ్వడం జరిగింది. డాక్టర్ విజయలక్ష్మి షాద్ నగర్ డివిజన్ డిప్యూటీ డిఎమ్, హెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంలో షాద్ నగర్ డివిజన్లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్వైజర్లు డాక్టర్ వి.విజయలక్ష్మి కీ శుభాకాంక్షలు తెలిపారు . హెల్త్ సూపర్వైజర్లు అందరూ, అన్ని ప్రోగ్రాంలో షాద్నగర్ డివిజన్ కు నిర్దేశించిన లక్ష్యాలను ముందంజలో తీసుకపోవడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంలో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సూపర్వైజర్లు అనగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బాధ్యతాయుతమైన సూపర్వైజర్ అని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్లు అందరూ కూడా వైద్య అధికారులకు, ఏఎన్ఎం లకు మరియు ఆశాలకు అనుసంధానముగా పనిచేస్తూ, అన్ని ప్రోగ్రాంలో సాధించవలసిన లక్ష్యాలను, ముందంజలో తీసుకుపోవడానికి కృషి చేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మూసీ నదీ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

▸ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం



**జయభేరి, హైదరాబాద్:**

మూసీ నదీ పరివాహక అభివృద్ధిపై నానక్ రామ్ గూడ హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ రివర్ బౌండరీస్ లొకేషన్ స్కెచ్ తో పాటు పలు వివరాలను సీఎం కు అధికారులు వివరించారు. మూసీ అభివృద్ధి ప్రక్రియ వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కసరత్తు పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం ఇచ్చారు. ఇందుకు ముందుగా మూసీ క్లీనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని చారిత్రక కట్టడాలను కలుపుతూ ఉండేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్ఆనరు. అధికారులకు పని విభజన చేసి మూసీ నదీ పరివాహక అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

# భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

▸ కాషాయమయమైన జవహార్ నగర్ రహదారి

▸ ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మాన్ని రక్షించుకుందాం..

▸ లవ్ జీహాద్, మత మార్పిడిలు వంటి అరాచకాలను అరికట్టాలి - భజరంగ్ దళ్

▸ జవహార్ నగర్ లో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటూ యువత ప్రతిజ్ఞ..

**మేడ్చల్ జిల్లా/జవహార్ నగర్, ఫిబ్రవరి 19:**



ఛత్రపతి శివాజీ జయంతి సంధర్భంగా దేశ వ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. ఇందులో భాగంగానే మేడ్చల్ జిల్లా జవహార్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ లో కూడ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ యువతి, యువకులు పెద్ద ఎత్తున ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్ర నిర్వహించారు. బాలాజీ నగర్ లోని భజరంగ్ కాలనీ హనుమాన్ ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర ప్రధాన రహదారి మీదగా వెళ్లి జవహార్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయం ఎదురుగా వున్న డా.బి.ఆర్ అంబేద్కర్,బి.జే.ఆర్ ల విగ్రహాల చౌరస్తా వద్ద ముగిసింది. కాషాయ జెండాల వెలుగులో "జై భవాని.. వీర శివాజీ, భారత్ మాతాకీ జై" నినాదాలంటూ, ఆటపాటలతో యువత శోభాయాత్రలో హోరెత్తించారు. అనంతరం భజరంగ్ దళ్ నేతలు మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ కోసం వీరోచిత యుద్దాలు చేసి హిందూ సామ్రాజ్యాన్ని పునర్ స్థాపితం చేసిన ఛత్రపతి శివాజీని ప్రతి ఒక్క హిందువు ఆదర్శంగా తీసుకోవాలని తెలుపుతూ.. ప్రతి హిందువు ధర్మ రక్షణ చేయాలని ముఖ్యంగా మత మార్పిడిలను, లవ్ జీహాద్, గోహత్యలు వంటి అరాచకాలను అరికట్టాల్సిన అవసరం, ఆలయాలను రక్షించుకోవల్సిన బాద్యత మనపై వుందని హిందువులపై జరుగుతున్న వివక్షతను వివరించారు. అనంతరం హిందూ ధర్మ రక్షణతో పాటు రాబోయే రోజుల్లో అందరిని కలుపుకుని ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జవహార్ నగర్ లో ఏర్పాటు చేస్తామని శోభాయాత్రలో పాల్గొన్న యువతతో పాటు నాయకులు ప్రతిజ్ఞ చేసారు.




# మేడారం బస్ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే




**జయభేరి, టేకులపల్లి :**

తెలంగాణా రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో నేటినుంచి ఈనెల 25వ తేదీ వరకు టేకులపల్లి నుంచి మేడారం జాతరకు వెళ్ళు భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రయాణ సముదాయాన్ని నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

కార్యక్రమ అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నాక నెరవేర్చిన హామీల్లో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మేడారం జాతరకు కూడా అమలు చేయడం జరిగిందని కావున మేడారం జాతరకు వెళ్ళు మహిళలు ఆధార్ కార్డు తమవెంట తప్పనిసరిగాఉండేలాచూసుకోవాలని, అదేవిధంగా టేకులపల్లి నుంచి మేడారం జాతరకు పెద్దలకు 380,పిల్లలకు 200 రుపాయలుగా టికెట్ రేటు నిర్ణయించటం జరిగిందని, కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇన్స్ స్పెక్టర్ సైధా రావూఫ్, ఆర్టీసీ డీఎం. బీ.వెంకటేశ్వరరావు, అధికారులు నరసయ్య, భూమిక, కుమార్, హెల్త్ కమ్యూనిటీ సిబ్బంది వజ్జా పార్వతి, కల్తీ వెంకట రమణ, పూనెం చంద్రకళ, వాంకుడోత్ లక్ష్మి, నాగమణి, రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు గుడిపూడి కృష్ణయ్య, ఉల్లోజి ఉదయ్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యానాయక్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఆఫ్రోజ్, టేకులపల్లి మాజీ ఉప సర్పంచ్ కె.సురేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, నర్సింగ్ లక్ష్మయ్య, అజ్మీరా శివ, మడుగు సాంబమూర్తి, మండల నాయకులు మూడ్ సంజయ్, బోడా మంగీలాల్ నాయక్, రావూరి సతీష్, బొడ్డు అశోక్, నల్లమోతు వెంకటేశ్వర్లు, భూక్యా సర్దార్, బానోత్ రవి, గడ్డం మధు, బానోత్ రామారావు, కంగల అనీల్, ఖానా, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.




# బాధ్యతలు స్వీకరించిన శామిర్ పేట్ నూతన తహసీల్దార్

▸ శామిర్ పేట్ తహసీల్దార్ గా పి. యాదగిరి రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

**జయభేరి, ఫిబ్రవరి 19 :**

శామిర్ పేట్ తహసీల్దార్ గా పి. యాదగిరి రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండలం నుంచి ఇక్కడకు బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ ప్రసన్న, సర్వేయర్ వెంకటేష్,ఆర్ఐ సుమలత, సీనియర్ అసిస్టెంట్ అంజాత్, కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలవాసులకు మెరుగైన సేవలను అందేలా తన వంతు సహకారం అందిస్తానని తహశీల్దార్ యాదగిరి రెడ్డి తెలిపారు.

# నూతన తహసీల్దార్ ను సన్మానించిన ఎంపీటీసీ డప్పు సాయిబాబా



**జయభేరి, ఫిబ్రవరి 19:**

మేడ్చల్ జిల్లా శామిర్ పేట్ మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన పి. యాదగిరి రెడ్డి ని ఎంపీటీసీ డప్పు సాయిబాబా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో పెండింగ్ లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ ను ఎంపిటిసి డప్పు సాయిబాబు కోరారు.

# స్కాన్ ఎనర్జి పరిశ్రమలో భారీ పేలుడు..

▸ కార్మికులకు తీవ్ర గాయాలు



**జయభేరి, షాద్ నగర్:**

షాద్ నగర్ నియోజక వర్గం కొందుర్గు మండల కేంద్రంలోని స్కాన్ ఎనర్జీ ప్రైవేటు పరిశ్రమలో భారీ పేలుడు సంభవించడంతో కార్మికులు గాయాల పాలయ్యారు.. దీంతో పనిలో నిమగ్నమైన కార్మికులపై వేడి ద్రవం పడినట్లు స్థానికులు చెపుతున్నారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం షాద్ నగర్ కు తరలించారు. పేలుడుతో పరిశ్రమ మొత్తం దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు బయటికి పరుగులు తీశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.. పేలుడు జరిగినప్పుడు బీతావాహ పరిస్థితి ఏర్పడినట్లు కార్మికులు చెబుతున్నారు



ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి సందర్భంగా ఇబ్లీబన్ శివాజీ బ్రిడ్జి వద్ద ఉన్న శివాజీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకుడు ఎస్.పి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. శివాజీ తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసిన పాలకుడని, ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, ప్రజల సంక్షేమం కోసమే పాటు పడ్డాడు అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా నవయువక్ మండలి ప్రతినిదులు వినయ్ షిండే, దినేష్ అంబ్రే, జి.ప్రణీత్, వికాస్ జాదవ్, వినోద్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.



# హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు ఛత్రపతి శివాజీ

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని 17వ డివిజన్ లో సోమవారం ఛత్రపతి శివాజి మహారాజ్ జయంతి వేడుకలో పాల్గొన్న తుంగతుర్తి రవి. ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ.. అతని తల్లి జీజాబాయి, తండ్రి శహాజీ మొఘల్ చక్రవర్తి సైన్యంలో ఉన్నారు. అయితే జీజాబాయికి హిందూమతాన్ని పునరుద్ధరించాలనేది పెద్ద కల. తన కొడుకుకు స్ఫూర్తినిచ్చే కథలు చెబుతూ, అతనిలో ధైర్యాన్ని నింపి హిందూ సామ్రాజ్యాన్ని పునర్నిర్మించాడు.

భారతదేశ చరిత్రలో గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయన పేరు వింటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్నతనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని, వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూ మతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. భారతావనిలో చాలా మంది రాజులు పరిపాలించినప్పటికీ ఈ లక్షణాలే శివాజీని గొప్పరాజుగా చేశాయి. శివాజీ దేవి భక్తుడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడొంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ఛత్రపతి శివాజీ మహారాష్ట్ర, కర్నాటక మరియు ఆంధ్రాలో శక్తివంతమైన సుల్తానుల అందరికీ, వారి సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ, స్త్రీని



గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు అందుకే ఆ యోధుడి జన్మదినోత్సవాన్ని భారతదేశ వ్యాప్తంగా ఒక వేడుకలా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి గారు, భాస్కర్, కవిడె కుమార్, వినాయక్, శ్యామ్, సతయ్య గౌడ్, సురేష్, గోవింద్, శరత్ గౌడ్, విష్ణుపురి కాలనీ వాసులు తదితరులు పాల్గొనటం జరిగింది.



## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని గాగ్గిలాపురం గ్రామంలో శ్రీ మహాగణపతి, నవగ్రహ, కనకదుర్గ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అన్నారు. చందంపేట మండలం గాగిళ్ళపురం గ్రామంలో శ్రీ మహాగణపతి, నవగ్రహ, కనకదుర్గ, ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవం కార్యక్రమంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి, చందంపేట ఎంపీపీ నూస్నావత్ పార్వతి చందు నాయక్, ఎస్ఎంసి చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, స్థానిక ఎంపీటీసీ తంగిళ్ళ రజిత రామకృష్ణారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం యాదవ్, వెంకటయ్య, నారాయణరెడ్డి, ఎల్లయ్య, ఆర్.ఎం.పి, విజయ్ నాయక్, సుజిత్ కుమార్, ఆనంద్, సుధాకర్, కృష్ణయ్య, సతీష్, రుక్మారెడ్డి రుక్మారెడ్డి, బద్దల సత్యనారాయణ, పచ్చిపాల కృష్ణయ్య, శంకర్, సుభాష్, రమేష్, రాజు, అంజి, రాములు, వెంకట్, వివిధ గ్రామాల కార్యకర్తలు నాయకులు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒరిస్సా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- మూడు లక్షల విలువైన గంజాయి పట్టుకున్న పోలీసులు



**జయభేరి, ఇల్లందు క్రైమ్ :**

ఒరిస్సా ప్రాంతం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మీదుగా హైదరాబాద్ మూడు లక్షల విలువైన గంజాయి అక్రమ రవాణా ను పోలీసులు పకడ్బందీగా వ్యవహరించి గంజాయి రవాణా చేస్తున్న ఒరిస్సాకు చెందిన ఇద్దరి నిందితులను అదుపులో తీసుకున్నారు. ఒడిశాకు చెందిన జ్ఞానేశ్వర్ పూజారి, సత్యముజ్జి తమ స్వరాష్ట్రం ఒరిస్సా మల్కనగిరి నుంచి మూడు లక్షల రూపాయల విలువైన 12 కేజీల గంజాయిని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుంచి ఇల్లందు మీదిగా ఆర్టీసీ బస్సులో తరలించేందుకు ఇల్లందు కొత్త బస్టాండ్ ప్రాంతంలో అనుమానంతో కనిపించగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై అప్పారావు సిబ్బంది అదుపులో తీసుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. వీరు స్వరాష్ట్రం ఒరిస్సా నుంచి గంజాయి సేకరించి వయా భద్రాచలం, ఇల్లందు మీదుగా హైదరాబాద్లో విక్రయించేందుకు వెళ్తున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో పట్టుకున్న గంజాయి నిందితులను ప్రదర్శించిన పోలీసులు వారిని రిమాండ్కు తరలిస్తున్నట్లు తెలిపారు.






బోడుప్పల్ నగర పాలక సంస్థ 7వ డివిజన్ కేశవ్ నగర్ ప్రాంతంలో శివాలయం భూమి పూజ కార్యక్రమం లో మేయర్ సామల బుచ్చిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లోపీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**



# సింగరేణి సంస్థ మనుగడ.. కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- నూతన భూగర్భ గనుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తాం
- కార్మికులు అప్పగించిన భాధ్యతను విస్మరించంబోము
- కెఓసి పిట్ సమావేశంలో వర్కర్స్ యూనియన్ ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి యండి నజీర్ అహ్మద్



**జయభేరి, టేకులపల్లి :**

సింగరేణి సంస్థ పరిరక్షణ, మనుగడ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పని చేస్తుందని యండి నజీర్ అహ్మద్ స్పష్టం చేశారు. ఆదివారం కొయగుడెం ఓసిలో జరిగిన పిట్ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పక్షాన ఉండి, కార్మికులు, సంస్థ కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని కార్మికులు గుర్తించారని అన్నారు. ప్రస్తుత, గత సర్కారు సంఘాలను బుద్ధి చెప్పి సింగరేణి, కార్మికుల మనుగడను కాపాడే సంఘానికి కార్మికులు పట్టం కట్టారని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. నూతన భూగర్భ గనులు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని, కార్మిక హక్కులను కాపాడుతామని అన్నారు. ఎన్నికల సమయంలో కార్మికుల ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయిస్తామని అన్నారు. బొగ్గు బావులను వేలం వేయించే విధానానికి స్వస్తి పలికే విధంగా పాలకులపై వత్తిడి తెస్తామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ గుర్తింపు సంఘానికి సహకరాన్ని అందించాలని కోరారు. ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపించిన కార్మికవర్గానికి అయన కృతజ్ఞతలు తెలిపారు.తొలుత గుర్తింపు సంఘం విజయ పతాకాన్ని సీనియర్ ఎలక్ట్రీషియన్ కె శ్రీనివాస్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు,ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోత్ కృష్ణ, వర్క్ మ్యాన్ ఇస్పేక్టర్స్ గడ్డం అనంత శ్రీనివాస్, కాలే పుల్లయ్య, షిఫ్ట్ ఇంచార్జ్ లు మహ్మద్ షబ్బీర్, సామల శ్రీనివాస్,రామకృష్ణ చారి, వేంగళ రవి,ఎస్ ఐలయ్య,కనకరాజు, ఇబ్రహీం, పెరుగు భాస్కర్, మైఖేల్, పవన్ కుమార్,శ్రీరాములు, నవీన్ కుమార్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్, రవికుమార్ ,మహ్మద్ సలీం,బొటిక శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- జిహెచ్ఎంసికి బడ్జెట్లో రూ.1100 కోట్ల నిధుల కేటాయింపు పట్ల హర్షం
- జిహెచ్ఎంసి అప్పులకుప్పగా మార్చిన గత ప్రభుత్వం: రజిత పరమేశ్వర్ రెడ్డి




**జయభేరి, ఉప్పల్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి జిహెచ్ఎంసి కాంగ్రెస్ కార్పొరేటర్లు సోమవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో జిహెచ్ఎంసికి రూ.1100 కోట్ల నిధులను కేటాయించడం పట్ల కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం సందర్భంగా బల్దియా కార్యాలయంలో కార్పొరేటర్లు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహానగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ తెలిపారు. ప్రభుత్వం నిధులను కేటాయిస్తూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు కృషి చేయడాన్ని హర్శించారు. గత ప్రభుత్వం జిహెచ్ఎంసిని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. రూ.7000 కోట్ల అప్పులను చూపిందని ఆరోపించారు. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా జిహెచ్ఎంసికి నిధులను కేటాయించి ఆదుకున్న చరిత్ర ఉందన్నారు. మేయర్ కనీసం కౌన్సిల్ సమావేశం కూడా ఏర్పాటు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జిహెచ్ఎంసి బడ్జెట్లో అంకెల గారడీ తప్ప అభివృద్ధికి నిధులు మాత్రం కనిపించడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు మందముల రజితపరమేశ్వర్ రెడ్డి, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బొంతు శ్రీదేవి, విజయారెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, ఎస్ .ఎన్ రెడ్డి, జగదీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.







## కొత్తూరు మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీరు

- షాద్ నగర్ "ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్"
- ఇటివలే అసెంబ్లీలో సమస్యపై ప్రస్తావించిన "ఎమ్మెల్యే శంకర్"
- స్పందించిన మిషన్ భగీరథ అధికారులు
- మరమత్తు పనులను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే శంకర్

**జయభేరి, షాద్ నగర్:**

షాద్ నగర్ నియోజకవర్గం లోని కొత్తూరు మున్సిపాలిటీకి తలెత్తిన మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో అధిగమించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మిషన్ భగీరథ పనుల ఉదాసీనతపై సభలో స్పీకర్ దృష్టికి తెచ్చారు. గత కొంతకాలంగా కొత్తూరు మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతున్న అలసత్వంపై సభలో ప్రశ్నించారు. అయ్యప్ప టెంపుల్ వద్ద మిషన్ భగీరథ పైపుల లీకేజీ సమస్యల కారణంగా నీటి సరఫరా జరగడంలేదని దీనిని వెంటనే పునరుద్ధరించి కొత్తూరు మున్సిపాలిటీ ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందించాలని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సోమవారం ఇట్టి పనులను మిషన్ భగీరథ అధికారి సందీప్ ఆధ్వర్యంలో మరమ్మత్తురు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మరమ్మత్తు పనులు ప్రారంభం అయ్యాయని మరో మూడు రోజుల్లో కొత్తూరు మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీరు విడుదల అవుతాయని పేర్కొన్నారు. మరమ్మత్తుల పనుల విషయంలో అలసత్వం అధికారుల ఉదాసీనత వెరసి ఇంతకాలంగా నీరు సరఫరా కాలేదని, ప్రస్తుతం అసెంబ్లీలో ఈ సమస్యను లేవనెత్తిన కారణంగా అధికారులు వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టారని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. సోమవారం మరమత్తు పనులను ఎమ్మెల్యే శంకర్ స్వయంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నీరు అందే విధంగా అధికారులు ప్రయత్నించాలని ఎమ్మెల్యే శంకర్ ఆదేశించారు.

## బ్లడ్ బ్యాంక్ అనుమతుల రద్దు

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 19**

: బ్లడ్ బ్యాంక్ పేరిట మోసాలకు పాల్పడుతున్న సంస్థలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీకర హస్పిటల్ బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల లైసెన్స్ క్యాన్సిల్ చేసింది డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్. ఆ బ్లడ్ బ్యాంకులు నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్మా కలెక్ట్ చేస్తున్నాయి. మూసాపేట్ లోని హీమో సర్వీసెస్ నిర్వాహకులు ల్యాబరేటరీలో అక్రమంగా ప్లాస్మాని స్టోర్ చేసినట్లు గుర్తించారు. మియాపూర్ శ్రీకర్ బ్లడ్ బ్యాంక్, దారుల్షిఫాలోని న్యూలైవ్ బ్లడ్ బ్యాంక్ నుంచి ఇక్కడికి ప్లాస్మా తీసుకొచ్చి... అక్రమంగా ప్లాస్మా అమ్ముతున్నట్లు గుర్తించారు. దాంతో ఈ రెండు బ్లడ్ బ్యాంక్ల లైసెన్సులు రద్దు చేస్తూ డ్రగ్ కంట్రోల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.మనుషుల రక్తం, ప్లాస్మా అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ లో అమ్ముతున్న బ్లడ్ ల బ్యాంక్ ల పర్మిషన్ రద్దు చేశారు. మియాపూర్ లోని శ్రీకర బ్లడ్ బ్యాంక్, దారుల్ షిఫా లోని న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేశారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. ఈ సంస్థలు అనుమతులు లేకుండా బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రక్తం, ప్లాస్మా అక్రమంగా నిల్వ ఉంచి బ్లాక్ లో అమ్ముతున్న ముఠాను అధికారులు ఇదివరకే పట్టుకున్నారు. మూసాపేటలోని హీమో సర్వీస్ ల్యాబొరేటరీస్ కేంద్రంగా ప్లాస్మా నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో డ్రగ్ కంట్రోల్ అధికారులు ల్యాబ్ నిర్వాహకుడు రాఘవేంద్ర నాయక్ ను విచారించారు. శ్రీకర బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ సెంటర్ లు హీమో ల్యాబ్ నుంచి బ్లాక్ లో ప్లాస్మా, రక్తం కొంటున్నాయని అధికారులు గుర్తించారు.








## నింగి నుంచి జారే..

చైతన్యరావు, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'పారిజాత పర్వం'. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మాతలు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలోని 'నింగి నుంచి జారే..' అనే పాటను సోమవారం విడుదల చేశారు. రీ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. హరిచరణ్, లిప్సిక ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఇటీవలే విడుదలైన కాన్సెప్ట్, ఫస్ట్‌లుక్ టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని, వినోదాత్మక చిత్రంగా మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు.

## భలే ఛాన్సులే..

ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ద్వారా జాన్వీకపూర్ తెలుగులో అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. తన తల్లి, దివంగత అందాల తార శ్రీదేవి మాదిరిగానే తనకు తెలుగు ఇండస్ట్రీ అంటే ప్రత్యేకమైన అభిమానమని, దక్షిణాదిలో తన తొలి ప్రాధాన్యత తెలుగు భాషకేనని పలు సందర్భాల్లో చెప్పింది జాన్వీకపూర్. తాజాగా ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. గ్రామీణ నేపథ్య స్పోర్ట్స్ డ్రామా కథాంశమిది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపిక జరుగుతున్నది. ఈ చిత్రంలో కథానాయికగా జాన్వీకపూర్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి బోనీ కపూర్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో జాన్వీకపూర్ రామ్‌చరణ్ షూటింగ్‌లో జాయిన్ అవుతుందని, తెలుగులో తన కుమార్తెకు మరో మంచి అవకాశమిదని బోనీకపూర్ ఆనందం వ్యక్తం చేశారు.

## అందులో కొత్త పూజని చూస్తారు

గత ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన సల్మాన్ 'కిసీ కా భాయ్ కిసీకి జాన్' తర్వాత పూజా హెగ్డే సినిమా ఒక్కటి కూడా విడుదల కాలేదు. దాదాపు ఏడాది నుంచి తమ అభిమాన తార వెండితెరపై కనిపించకపోవడం పూజా అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్న అంశం. అయితే.. ఈ బాధ ఈ ఏడాది అక్టోబర్ 11 వరకేనని, ఆ రోజు షాహిద్‌కపూర్‌తో తాను నటిస్తున్న 'దేవ' విడుదల కానున్నదని, అందులో కొత్త పూజాని చూస్తారని అంటున్నారు మంగళూరు భామ పూజా హెగ్డే. తన కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను 'దేవ'లో చేస్తున్నట్టు పూజ చెప్పారు. ఓ హై ప్రొఫైల్ కేస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఈ సినిమా కథ నడుస్తుందని, కథనం షాక్‌కు గురిచేస్తుందని, తన పాత్ర తీరుతెన్నులు ఆడియన్స్‌ని షాక్‌కి లోను చేస్తాయని పూజా తెలిపారు.



## ఒక పథకం ప్రకారం..

సాయిరామ్‌శంకర్, అశీమా నర్వాల్, శృతీసోధీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్ దర్శకత్వం వహించారు. మార్చిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'థ్రిల్లర్ కథాంశమిది. సాయిరామ్‌శంకర్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపిస్తారు. సముద్రఖని పోలీసాఫీసర్‌గా నటించారు. క్రైమ్ డ్రామాగా ఆకట్టుకుంటుంది. గోపీసుందర్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఇటీవలే విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాజీవ్ రవి, సంగీతం: రాహుల్ రాజ్, నిర్మాతలు: వినోద్ విజయన్, గార్లపాటి రమేష్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com